


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**110**

**(7 జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**మొన్న ఒక** పెద్ద మనిషితో మాట్లాడటానికి వెళ్ళాను. పరిచయం అయిన తర్వాత క్రమంగా ప్రసంగంలోకి దిగాం. ఆయనగారికో వింత అలవాటుంది. ఒక విషయం చెప్పడం పూర్తి అవగానే, నాలిక కొద్దిగా కరుచుకుని, ఎడమచేతి గుప్పిటితో కుడి భుజం మీద ఒక్కసారి కొట్టుకుంటాడు తర్వాత మళ్ళీ సంభాషణ ప్రారంభిస్తాడు.

ఆ దెబ్బలు ఆయనగారి సంభాషణకు ఫుల్‌స్టాపులాగా కనిపించాయి. ఇష్టమొచ్చినప్పుడల్లా అలా కొట్టుకోకుండా, ఒక భావాన్ని పూర్తిచేసి ఆ సంతృప్తిలోనే అలా కొట్టుకోవడం ఎంతో గొప్పగా కనిపించింది. ఆయనలో కనిపించని చందస్సున్నదనిపించింది.

నా చిన్నతనంలో కొద్దిరోజులు ఒక మీసాల ఆసామీ దగ్గర ఒక చిన్న ఉద్యోగం చేశాను. ఆయన నా చేత ఉత్తరాలు వ్రాయిస్తూవుండేవాడు. ఒక ఉత్తరం చెప్పడానికి ఒక గంట పైగా చెప్పేవాడు. ఎందువల్ల? ప్రతి వాక్యం తరువాత ఎడమవైపు మీసాన్ని వేళ్ళతో కాసేపు కొరికేవాడు. అప్పుడు గాని ఆయనకు ఆలోచన తట్టేది కాదు.

అంత ఆలస్యంగా ఉత్తరం చెప్పి "త్వరగా టైపు చెయ్యండి. ఈ పోస్టులో వెళ్ళాలి. అరగంటే ఉంది" అని తొందరపెట్టేవాడు. ఒకరోజు ఆయన ఆలాటి హెచ్చరిక చేయగానే అన్నాను "తొందరగానే టైపు చేస్తాను. నాకు పెద్ద మీసాలు లేవుగా కొరుక్కుంటూ కూర్చోవడానికి" అని. ఆయనగారికి కొంచెం కోపం వచ్చిందనుకోండి. అది వేరే సంగతి. ఆయన అలవాటు మాత్రం పోలేదు.

ఈ రోజుల్లో చాలామంది రచయితలు కాఫీ, సిగరెట్లు బలంతో కాలం సాగిస్తున్నారు. అవిలేకుంటే. "ఆవు పాలు ఇచ్చును" "కుందేటికి కొమ్ములుండవు" "గుర్రం సకిలించును" వంటి వాక్యాలు కూడా వ్రాయలేకపోవచ్చు.

"ఈ కథ ఎన్నాళ్ళలో వ్రాశావు?" అని ప్రశ్నిస్తే

"ఆరు సిగరెట్టు పెట్టెల కొరతలో" అని ఒకాయన జవాబిచ్చారు.

"ప్రియురాలికి వ్రాసిన ప్రతి ఉత్తరానికి రూపాయి డెబ్బయి పైసలవుతోంది. రూపాయి సిగరెట్లకు, అర్ధరూపాయి కాఫీకి, ఇరవై పైసలు పోస్టు కవరుకూ" అని ఒకాయన వ్రాసుకొచ్చాడట డైరీలో.

నేను ఒక వారపత్రిక ప్రచురణ కార్యక్రమం చూస్తున్నప్పుడొకాయన అరవై పంక్తుల గేయం ఒకటి పంపాడు ఆయన ప్రసిద్ధ రచయిత. కానీ గేయం చివర "ఇది సిగరెట్టు కాల్చకుండా వ్రాసిన గేయం. అదే దీని ప్రత్యేకత" అని వ్రాశాడు.

అది చూచిన తర్వాత సిగరెట్ అలవాటుగల రచయితలు సిగరెట్టు మత్తులేకుండా కథలు, గేయాలు వ్రాసి కొన్ని ప్రకటిస్తే బాగుండుననిపించింది.

వెనుకటికి బందరులో ఒక కవి పుంగవుడు వ్రాశాడు. టీ, కాఫీ, హుక్కా, బీడీ, సిగరెట్టు, కారాకిల్లీ ఇత్యాదుల ఇన్‌స్పిరేషన్ ఉంటుంది. మరికొందరికో ప్రేయసి, ప్రియురాలు, విరహం, విప్రలంబం, నిరాశ, నిస్పృహ కారణమవుతాయి.

ఈ కాలంలో ఇన్స్పిరేషన్‌లకు కొరతలేదు. ఆకలి కడుపులు, పీకుడు ముఖాలు అధిక సంతానం ఆర్థిక దుర్భక్షం, కార్మిక శ్రేయస్సు, స్వాతంత్ర్యాసక్తి, ప్రభుత్వంపై విరక్తి, ఇత్యాదులెన్నోకాలాన్ని పరుగులెత్తిస్తున్నాయి.

పోతే, స్త్రీ రచయితలకు పొగ త్రాగుడు వగైరా అలవాట్లుండవు గనుక వారు వ్రాసే కవిత్వం చాలా వరకు సహజంగా, స్వచ్ఛంగా వుండే అవకాశాలేర్పడుతున్నాయి. అయితే, వారికి కొన్ని ఇబ్బందులు మాత్రం ఉంటాయి.

ఇటీవల ఒక రచయిత్రి సారస్వతాన్ని గురించి చర్చిస్తూ సంసార సేవలో గల బాధ్యత సాహిత్య సేవకు చాలా అడ్డం వస్తూ ఉంటాయి. ఈ విషయంపైన ఒక వ్యాసం వ్రాస్తున్నాను. ఏ క్షణానికా క్షణం ఏదో ఒక క్రొత్త సమస్య వచ్చిపడుతుంది సంసారంలో అన్నారు. నిజమే సంసారాలు సాహిత్య సేవకు కొంతవరకు అవరోధంగానే వుంటాయి. అని ఇన్స్పిరేషన్ కల్పించడానికి బదులు అనుకుని "పాల్పిటేషన్" కల్పిస్తూవుంటాయి.

మా మిత్రుడొకాయన ఉండేవారు. ఆయన రచయిత. ఆయన ఏదైనా రచన ప్రారంభించడానికి ముందు ఎంతో బాధపడేవాడు. ఒకప్పుడా బాధ పది, పదిహేను రోజులదాకా ఉండేది. కలం తీసుకోవడం, కొంచెం సేపు ఆలోచించి, కళ్ళు నులుపుకుని దాన్ని క్రిందపెట్టి కూర్చోవడం తర్వాత లాభం లేదని లేచి ఇవతలకు రావడం ఆయనకు అలవాటైంది.

ఇలా వారం రోజులపాటు ప్రతి వ్యాసానికి, ఆయనగారికి దొంగనొప్పులు వచ్చిపోవడం ఆచారమైపోయింది. కానీ మొదలు పెడితే మాత్రం అన్నం తినకుండా కూర్చుని ఆ వ్యాసం పూర్తిచేసేవాడు. ఆదిలో ఎంత బాధపడ్డా చివరకు 'సుఖప్రసవం' అని సంతోషించేవాడు.

'నా సహాధ్యాయి ఒకడున్నాడు, ఆయన ఏమి వ్రాయాలన్నా అంతులేని బాధతో గంటా రెండు గంటలు గడిపేవాడు. ముఖం ఎర్రబడేది. కళ్ళవెంట నీరు కారేది. ఆయన వంక చూడటానికి బాధగా ఉండేది. కొంతసేపటికి ప్రారంభించేవాడు వ్యాసం. ముఖంలో ఎరుపు కొంచెం కొంచెం తగ్గేది. పది కాగితాలు గీకి అవతల పారేసిన తర్వాత కళ్ళలో మంచు పువ్వులు విరిసేవి.

ఆదిలో అనుభవించే బాధకు ఆయన "కృత్యాద్యవస్థ" అని పేరు పెట్టుకున్నాడు పాపం. ఆరంభ దశలో మాత్రం సృష్టి అంతా తిరగతోడుతున్న వాడి ఫోజు పెట్టడం ఆయనగారికి రివాజయిపోయింది. వ్రాసింది బేరీజు వేస్తే ఆ విలువ కనిపించేది కాదు.

ప్రఖ్యాత నవలా రచయిత బాల్జాక్ ఏదైనా వ్రాయాలంటే అర్ధరాత్రివేళ లేచి కూర్చునేవాడట. తెల్లవారినా కలం క్రిందపెట్టేవాడుకాదు. మర్నాడు మిట్టమధ్యాహ్నం అయ్యేవరకూ ఆ కలం అలా పరుగులు తీస్తూనే ఉండేది. మరి ఎక్కడది అంత బలం?

ఆయన దగ్గర ఎప్పుడూ ఒక నౌకరుండేవాడు. బాల్జాక్ అడక్కపోయినా ఆ నౌకరు అరగంటకోమాటు కాఫీ కప్పులో పోసి దగ్గర పెడుతుండేవాడట. అది చల్లారకుండా నోట్లో పోసుకోవడం ఉషారు చల్లారకుండా చూసుకోవడం బాల్జాక్ కవి పని.

అలా కాఫీ సముద్రానికి జీవితమంతా అతగాడు అపుపోసనం పడుతూనే ఉండేవాడట. చాలామంది అంటూ ఉండేవారట "ఆ గ్రంథాలన్నీ కాఫీ వ్రాసింది. బాల్జాక్ కాదు" అని. నిజమే మరి. కాఫీ అలా ఉంచకపోతే ఆయన ఒక ఉత్తరం కూడా వ్రాయలేక పోయేవాడేమో.

హిందీ సాహిత్యంలో ప్రముఖ వ్యక్తిగా పరిగణింపబడిన భారతీయ హరిశ్చంద్ర తను ఏది వ్రాయాలన్నా ముందుగా గుప్పెడు అగరువత్తుల వెలిగించేవాడట. వాటి పరిమళంలో ఆఘ్రాణిస్తూ, అద్భుతమైన రచనలు చేసేవాడట.

ఇప్పటివలే ధరలు ఆకాశం అంటకుండా అందుబాటులో ఉండే ఆ రోజుల్లోనే ఆయన ప్రతిరోజూ పాతిక ముప్పయి రూపాయల విలువగల అగరు వత్తులు వెలిగించేవాడట. ఆహారం, వగైరాలకు ఎంత ఖర్చుపెట్టేవాడో తెలియదు. ఆయన్ని "అగరవత్తుల మహాకవి" అనేవారట.

Post your comments